మాస్ డైరెక్టర్ కథకు గ్రీన్‌సిగ్నల్?

ఓ సినిమా వేడుకలో బాలకృష్ణ కోసం కథ రాస్తున్నానని దర్శకుడు హరీష్ శంకర్ చెప్పారు. అయితే.. అది జరిగి చాలా కాలమైంది. బాలయ్య తన సినిమాలతో బిజీగా ఉంటున్నారు. హరీష్‌శంకర్ కూడా తన ప్రాజెక్టులతో బిజీ. మరి బాలకృష్ణ కథ ఎందాక వచ్చింది? అనేది మాత్రం మొన్నటిదాకా ప్రశ్నగానే మిగిలిపోయింది. అయితే.. ఇన్‌సైడ్ వర్గాల సమాచారం ప్రకారం బాలకృష్ణ కథను హరీష్‌శంకర్ సిద్ధం చేశారట. బాలయ్యకు వినిపించడం, అది ఆయనకు నచ్చడం కూడా జరిగిపోయిందట. ప్రస్తుతం హీరో యష్‌తో 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. హరీష్‌శంకర్‌కు రీమేక్ డైరెక్టర్ అనే ముద్ర ఉంది. ఆ ముద్రను చెరిపేసుకునే ప్రయత్నంగా ఈసారి బాలయ్యకోసం ఓ కొత్త కథను సిద్ధం చేశారట హరీష్‌శంకర్. బాలయ్య చరిష్మాకు, హరీష్ టైమింగ్ తోడైతే హిట్ పక్కా అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఫౌజీలో అనుపమ్‌ఖేర్

1940నాటి హిస్టారికల్ ఫిక్షన్ బ్యాక్‌డ్రాప్‌తో ప్రభాస్ నటిస్తున్న పానిండియా యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ల్యార్జర్ దేన్ లైఫ్ ఎలిమెంట్స్‌తో కూడిన పాన్ ఇండియా సినిమాగా దర్శకుడు హను రాఘవపూడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే.. ఈ చిత్రంలో బాలీవుడ్ లెజెండ్ అనుపమ్‌ఖేర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా షేర్ చేశారు. పైగా తన పోస్ట్‌లో 'ఈ స్క్రిప్ట్ అద్భుతం' అని పేర్కొన్నారాయన. ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం పట్ల అనుపమ్ ఆనందం వ్యక్తం చేశారు. దర్శకుడు హను రాఘవపూడి ప్రతిభను కూడా ఆయన ప్రశంసించారు. 'ఇండియన్ బాహుబలి ప్రభాస్‌తో నా 544వ చిత్రం ప్రకటిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ప్రతిభావంతుడైన దర్శకుడు హను రాఘవపూడి, రాజీ అనే పదానికి అర్థం తెలియని మైత్రీ మూవీమేకర్స్, మై డియర్ ఫ్రెండ్ సుదీప్ ఛటర్జీ.. ఈ కలయిక నిజంగా అద్భుతం..' అని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇమాన్వి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్.



కొత్త సినిమాకు గ్రీన్‌సిగ్నల్?

రామ్‌చరణ్ నటిస్తున్న 16వ చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని గ్రామీణ క్రీడా నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. కుస్తీతో పాటు క్రికెట్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథ సాగుతుందని సమాచారం. 'పెద్ది' అనే టైటిల్ కూడా ప్రచారంలో ఉంది. ఇదిలా వుండగా రామ్‌చరణ్ మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. 'హాయ్ నాన్న' చిత్రంతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు శౌర్యువ్. ఆయన ఇటీవల రామ్‌చరణ్‌కు ఓ కథని వినిపించారని తెలిసింది. కథలోని కొత్తదనం, తన పాత్ర నచ్చడంతో ఈ సినిమాకు రామ్‌చరణ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని అంటున్నారు. అయితే ఇందులో నిజమెంతో తెలియాలంటే మాత్రం చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

నాని సినిమాలో మరో ఇద్దరు హీరోలు

'హిట్– 3' షూటింగ్‌లో బిజీ బిజీగా ఉన్నారు నాని. దర్శకుడు శైలేష్ కొలను హిట్ ఫ్రాంచైజీలో ఇది మూడో భాగం. ఇందులో అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ రోల్‌లో నాని కనిపిస్తారు. ఈ వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ సినిమాలో నానితోపాటు మరో ఇద్దరు యంగ్ హీరోలు కనిపించనున్నారట. వారెవరో కాదు. 'హిట్' సినిమా హీరో విశ్వక్‌సేన్. 'హిట్–2' కథానాయకుడు అడివి శేషు. కథ డిమాండ్ చేయడంతో వీరిద్దరూ ఈ సినిమా భాగం కావాల్సివచ్చిందని తెలుస్తున్నది. నాని, విశ్వక్, అడివి శేషు కాంబినేషన్ సీన్స్ ఆడియన్స్‌ని కట్టిపడేస్తాయట. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

రూరల్ యాక్షన్ డ్రామా

తొలి చిత్రం 'మేం ఫేమస్'తో నటుడిగా, దర్శకుడిగా మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు సుమంత్‌ప్రభాస్. ప్రస్తుతం ఆయన తన రెండో చిత్రంలో నటిస్తున్నారు. సుభాష్‌చంద్ర దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇటీవల సెకండ్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. రేలంగి, భీమవరం, సకినేటిపల్లి లంక, అంతర్వేది ఆలయ ప్రాంగణంలో సహా అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరిగింది. ఈ షెడ్యూల్‌లో సుమంత్‌ప్రభాస్, నిధిప్రదీప్, జగపతిబాబు, లైలా, రాజీవ్ కనకాల పాల్గొన్నారు. ఈ నెలాఖరులో మూడవ షెడ్యూల్ ప్రారంభిస్తామని గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇదని చిత్రబృందం పేర్కొంది. రాజీవ్ కనకాల, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్ కుమార్ కసిరెడ్డి, వైవా రాఘవ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిసంతోష్, సంగీతం: నాగవంశీ కృష్ణ, నిర్మాణ సంస్థ: రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్, దర్శకత్వం: సుభాష్‌చంద్ర.

విఫల ప్రేమజ్ఞాపకాలు

ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకుంది కథానాయిక ఐశ్వర్యరాజేష్. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన విఫల ప్రేమ అనుభవాలను పంచుకుంది భామ. ప్రేమించడం సులువని, అది విఫలమైనప్పుడు వచ్చే బాధ నుంచి బయటపడటం మాత్రం చాలా కష్టమని పేర్కొంది. 'సినిమాల్లోకి అడుగుపెట్టిన కొత్తలో ఓ వ్యక్తిని ప్రేమించాను. అనుకోకుండా మేమిద్దరం విడిపోయాం. ఆ తర్వాత అతని నుంచి వేధింపులు ఎదుర్కొన్నా. అంతకు మందు కూడా అలాంటి అనుభవమే ఎదురైంది. ప్రస్తుతం ఎలాంటి రిలేషన్‌షిప్‌లో లేకుండా ప్రశాంతంగా ఉన్నా. అనుభవాలు నేర్పిన పాఠంతో ప్రేమలో పడాలంటే భయమేస్తుంది' అని చెప్పింది. జీవితంలో తన తల్లి ఎంతగానో స్ఫూర్తిని చ్చిందని, ఆమెకు అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో చిన్న వయసులోనే పార్ట్‌టైమ్ జాబ్స్ చేశానని, ప్రస్తుతం మనసుకు నచ్చిన కథాంశాలను ఎంచుకుంటూ కెరీర్‌లో ముందుకుసాగుతున్నానని ఐశ్వర్య రాజేష్ తెలిపింది.

'బాపు' ఓ మంచి ప్రయత్నం

నటుడు బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో నటిస్తున్న డార్క్ కామెడీ చిత్రం 'బాపు'. ఆమని, బలగం సుధాకర్‌రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రధారులు. దయా దర్శకుడు. రాజు, నీహెచ్ భానుప్రసాద్‌రెడ్డి నిర్మాతలు. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన హీరోలు రానా దగ్గుబాటి, తిరువీర్ చిత్ర నిర్మాతలకు శుభాకాంక్షలు అందించారు. బాపు ఓ మంచి ప్రయత్నమని, మంచి కంటెంట్ ఉన్న సినిమా అని తప్పకుండా అందరికీ నచ్చుతుందని బ్రహ్మాజీ చెప్పారు. విభిన్నమైన కథ, కథనాలతో ఈ సినిమా రూపొందిందని దర్శకుడు దయ తెలిపారు. ఇంకా మధుర శ్రీధర్, సంగీత దర్శకుడు ధృవన్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వాసు పెండెం, నిర్మాణం: కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్.

తండ్రీకూతురు కథ

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటిస్తున్న తాజా చిత్రం 'రాక్షస'. లోహిత్ హెచ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కన్నడ, తెలుగు భాషల్లో ఈ నెల 28న విడుదల చేయబోతున్నారు. నిర్మాత ఎంవీఆర్ కృష్ణ ఈ సినిమా తెలుగు హక్కులను దక్కించుకున్నారు. 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి స్వరకర్త. గురువారం టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ప్రేమ్ బి ఎస్ సాహిత్యాన్ని అందించిన ఈ గీతాన్ని సాయిచరణ్ ఆలపించారు. సినిమా కాన్సెప్ట్‌ను ఆవిష్కరిస్తూ పాట అర్థవంతంగా సాగింది. తండ్రీకూతుళ్ల అనబంధం నేపథ్యంలో ఈ సినిమా ఆకట్టుకుంటుందని నిర్మాత ఎంవీఆర్ కృష్ణ పేర్కొన్నారు. అరుణ్‌రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్ తదితరులు ఈ చిత్ర తారాగణం.